

భోగాపురం.. ముంజేరు అంగన్వాడీ కేంద్రం తాళాన్ని పగులకొడుతున్న వైసిపి నాయకుడు

భోగాపురం.. అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు అజశర్మ

మాటిచ్చి మడమతిప్పిన సిఎం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

భోగాపురం : అంగన్వాడీలకు జీతాలు పెంచుతామని గత ఎన్నికల్లో మాటిచ్చి ముఖ్యమంత్రి మడమతిప్పారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అన్నారు. భోగాపురంలో చేపడుతున్న అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది ద్వారా బలవంతంగా తాళాలు విరగ్గొట్టి తెరవడం దారుణమని అన్నారు. గత ముఖ్యమంత్రులు అంగన్వాడీలతో పెట్టుకొని ఇంట్లో కూర్చున్న విషయం మర్చిపోవద్దని ముఖ్యమంత్రిని హెచ్చరించారు. వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యూనియన్ నాయకులు కృష్ణవేణి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు చేశారు. తహశీల్దార్ బంగార్రాజుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు కొర్లమ్మ, శ్రీదేవి, సెక్టార్ లీడర్లు పి.అనిత, పి.చిన్నమ్మలు, పి.సుజాత, కె.ప్రవీణ పాల్గొన్నారు.

గజపతినగరం.. ఎంపిడిఒ కార్యాలయం వద్ద కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మొక్కవోని దీక్షతో..

- నాలుగో రోజుకు అంగన్వాడీల సమ్మె
- ఎర్రచీరలు, నల్లరిబ్బన్లతో నిరసన
- రోజురోజుకూ పెరుగుతున్న మద్దతు
- సంఘీభావం ప్రకటించిన టిడిపి, జనసేన, సిపిఐ, రైతు, కార్మిక, ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) చేపట్టిన సమ్మె గురువారానికి నాలుగోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎర్ర చీరలు కట్టి కళ్లకు గంతలు కట్టుకొని అంగన్వాడీలు నిరసన తెలిపారు. వీరి పోరాటానికి టిడిపి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, విజయనగరం నియోజకవర్గ ఇన్ఛార్జి పూసపాటి అదితి గజపతి, జనసేన నాయకులు మంత్రి పదాల అరుణ, యశస్విని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ దయానంద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి ఐదేళ్ల కావస్తున్నా ఇంత వరకు ఎందుకు వేతనాలు పెంచలేదన్నారు. వెంటనే వారి న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ అంగన్వాడీలు సమస్యలు పరిష్కారం చేసి, సమ్మెను విరమింప చేయాల్సిన ప్రభుత్వం మరింత రెచ్చగొట్టే విధంగా చర్యలు ఉన్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించడం, తాళాలు బద్దలు కొట్టించడం వంటి చర్యలు ప్రభుత్వం చేయాల్సిన పనులు కాదని, రౌడీలు చేయాల్సిన పనులని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం కవ్వింపు చర్యలు,బెదిరింపులు మానుకోవాలని లేదంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

గజపతినగరం : సమ్మె సందర్భంగా అంగన్వాడీలు కళ్లకు నల్లని రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం మెయిన్ రోడ్ నుంచి ఎంపిడిఒ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారానికి సమ్మె చేస్తే తాళాలు బద్దలుగొట్టే సంస్కృతికి ఈ ప్రభుత్వం తెరతీసిందని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. కేంద్రాల్లో సామాన్లు పోయిన బాధ్యత బద్దలు కొట్టే వాళ్లదని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం.సుభాషిని, ప్రాజెక్ట్ కార్యదర్శి బి.జ్యోతి, సెక్టార్ నాయకులు రాములమ్మ నాగమణి, సన్యాసమ్మ, అనురాధ, వి.పద్మావతి, నారాయణమ్మ నరసమ్మ,పద్మయమయంతి తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు మద్దతుగా మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు పడాల అరుణ మద్దతు, యుటిఎఫ్ నాయకులు భాస్కరరావు, శంకర్రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాము, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రాములు తదితరులు మద్దతు తెలిపారు.

డెంకాడ : మండలంలో 84 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఎంపిడిఒ స్వరూపరాణి ఆదేశాలతో సర్పంచులు, ఎంపిటిసిల సహకారంతో అంగన్వాడీ కేంద్రాల తాళాలను విరగ్గొట్టి తెరిపించారు. కొన్నిచోట్ల పిల్లలను బలవంతంగా తీసుకొచ్చి కూర్చోబెట్టారు. మోపాడ అంగన్వాడీ కేంద్రాన్ని గ్యాస్ కట్టర్తో తెరిచారు.

కొత్తవలస : అంగన్వాడీల సమ్మెకు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు ఇల్లాకు రాము, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గాడి ప్రసాద్ మద్దతు పలికారు. ఎంపిడిఒ వై.అరుణకు అంగన్వాడీలు వినతి అందించారు. మూతపడిన అంగన్వాడీ కేంద్రాలను మండల స్థాయి అధికారులు బలవంతంగా తెరిపించారు.

వేపాడ : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు ఎంపిడిఒ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. అనంతరం తహశీల్దార్కు వినతి అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లా జగన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్.కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : నాలుగో రోజు నిరవధిక సమ్మెలో భాగంగా చీపురుపల్లిలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బలగ నాగమణి ఆధ్వర్యాన ఎర్రరంగు చీరలు ధరించి, అంగన్వాడీలు నిరసన తెలియజేశారు. సమ్మెకు యుటిఎఫ్ మండల అధ్యక్షులు నడిపేన బలరాం, టిడిపి, జనసేన నాయకులు మద్దతు తెలిపారు.

బొబ్బిలి.. కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రామభద్రపురం : స్థానిక బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో అంగన్వాడీలు వినూత్నరీతిలో కళ్లకు గంతలు కట్టుకుని, ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు లక్ష్మి, సిఐటియు నాయకులు బలస శ్రీనివాసరావు, నాయకులు సత్యవతి, రాధమ్మ మేరీ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : నిరవధిక సమ్మెలో భాగంగా పట్టణంలోని ఎన్టిఆర్ బొమ్మ జంక్షన్లో అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టి మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, కౌన్సిలర్లు, నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. పిఎన్ఎం సభ్యులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వ తీరును ఎండగడుతూ పాట పాడి సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి అంగన్వాడీలు నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, బి.శ్రీదేవి, అనురాధ పాల్గొన్నారు. మున్సిపాలిటీలో బలవంతంగా అంగన్వాడీ కేంద్రాలను తెరిచినా శుక్రవారం పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఫీడింగ్ ఇవ్వలేదు. కేంద్రాలను తెరిచినా తమ పిల్లలను పంపించే ప్రసక్తి లేదని తల్లులు చెబుతున్నారు.

గంట్యాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. వీరికి సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీవీ రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మద్దతు తెలిపారు. అనంతరం తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. వినూత్నరీతిలో కళ్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలియజేశారు

గుర్ల : మండలంలో 95 అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం బలవంతంగా తెరిచారు. తాళాలను విరగ్గొట్టి తెరిచినట్లు తెరిచినట్లు గరివిడి ప్రాజెక్టు అధికారి ఆరుద్ర తెలిపారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఆడారి రమేష్, ఆడారి ఉమామహేశ్వరరావు, గనివాడ సన్యాసినాయుడు, అక్కునాయుడు, బి.శ్రీను, కర్రి శ్రీను, చౌక్కాకుల శ్రీనివాస, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన అంగన్వాడీలు తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. అంగన్వాడీలకు జనసేన, ఎపి గిరిజన సంఘం మద్దతిచ్చాయి. జనసేన నాయకులు సుంకర అప్పారావు, కొట్టాడ రామకోటి, జోనపల్లి సత్తిబాబు, అలమండ రాంబాబు, పిల్లా నర్సింగరావు పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపడుతున్న నాలుగో రోజు సమ్మె శిబిరాన్ని ఎపి రైతుసంఘం నాయకులు గోపాలం, సిఐటియు నాయకులు సురేష్ సందర్శించి, మద్దతు తెలిపారు. మండల కేంద్రంలో అంగన్వాడీలు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు ఆందోళన చేశారు.

నెల్లిమర్ల : అంగన్వాడీలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వామపక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి ఖండించారు. స్థానిక కార్మిక అమర వీరుల స్మారక భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. అంగన్వాడీలు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

శృంగవరపుకోట.. అంగన్వాడీల సమ్మె శిబిరంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

కొండవెలగాడ అంగన్వాడీ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

అంగన్వాడీలకు మద్దతుగా టిడిపి నిరసన

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగాడలో శుక్రవారం సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాన్ని తాళాలు బద్దలుకొట్టి తెరిచారు. దీంతో అంగన్వాడీ కేంద్రం వద్ద టిడిపి నాయకులు దంతలూరి అజయ్బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. న్యాయమైన హక్కుల కోసం అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బలవంతంగా కేంద్రాలు తెరిపించడం దారుణమని టిడిపి నాయకులు మొయిద సీతంనాయుడు, మొయిద సత్యనారాయణ, బేరి అప్పలనర్సయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు టిడిపి అండగా ఉంటుందని భరోసాని చ్చారు. కార్యక్రమంలో రొంగలి రమణ, పొదిలాపు రమేష్, వల్లూరు సత్యనారాయణ, గౌడు సత్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లలకు సపర్యలు మీరు చేస్తారా?

- రెల్లివీధి అంగన్వాడీ కేంద్రం తెరవకుండా అడ్డుకున్న స్థానికులు
- దగ్గరుండి తాళాలు కొట్టిస్తున్న వైసిపి నాయకులు

విజయనగరంటౌన్ : విజయనగరంలో శుక్రవారం ఉదయం అంగన్వాడీ కేంద్రాలను తెరిచేందుకు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు కలిసి ప్రయత్నించారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సంజీవయ్య కాలనీలో అంగన్వాడీ కేంద్రాన్ని నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు రహీమ్ దగ్గరుండి తాళాలు కొట్టించి తెరిపించారు. మరో వైపు బాలాజీ మార్కెట్ పక్కనే ఉన్న రెల్లివీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు సచివాలయ సిబ్బంది రావడంతో ఆ ప్రాంత వాసులు తెరవనివ్వకుండా అడ్డుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న అంగన్వాడీ వర్కర్, ఆయాలు తమ పిల్లలను తల్లులుగా చూస్తున్నారని అన్నారు. వారి సొంత బిడ్డలాల్లో మా పిల్లలు మల మూత్ర విసర్జన చేసినా సేవ చేస్తున్నారని, ఆ పనులన్నీ మీరు చేస్తారా అని ప్రశ్నించారు. చేతనైతే సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. వీధిలో తాగునీరు రాకపోయినా, కాలువలు ,రోడ్లు లేక పోయినా పట్టించుకోని సచివాలయ ఉద్యోగులు ఇప్పుడు ఎందుకు వచ్చారని నిలదీశారు. చేసేది లేక 12 గంటలు వరకు వేచి చూసి సచివాలయం సిబ్బంది వెళ్ళిపోయారు.

డెంకాడ.. మోపాడ అంగన్వాడీ కేంద్రం తాళాన్ని గ్యాస్కట్టర్తో తెరుస్తున్న వ్యక్తి

కేంద్రాల నిర్వహణకు వాలంటీర్ల నిరాకరణ

మెంటాడ : అంగన్వాడీలు నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతుండటంతో మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. సమ్మెను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం అధికార యంత్రాంగంతో అక్కసు వెల్లగక్కింది. అందులో భాగంగా ట్రెయినీ కలెక్టర్ సహాదిత్ వెంకట్ త్రివినాగ్, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమరావు ఆధ్వర్యాన అంగన్వాడీ కేంద్రాల తాళాలను రాళ్లతో, సుత్తితో పగులగొట్టి తెరిపించారు. వాటిని నిర్వహణ బాధ్యతను వాలంటీర్లకు అప్పగించారు. కానీ మెంటాడ, ఆగూరు, పిట్టాడ, గుర్ల గ్రామాల్లో వాలంటీర్లు అంగీకరించలేదు. చిన్నారులకు భోజనం ఏర్పాటుచేయాలని చెప్పగా వారు నిరాకరించారు. జిటిపేటలో అంగన్వాడీ కేంద్రాన్ని తెరవకుండా తల్లిదండ్రులు అడ్డుకున్నారు.

వైసిపి నాయకులతో..

భోగాపురం : ముంజేరు అంగన్వాడీ కేంద్రం తాళాలను వైసిపి నాయకులతో సచివాలయ సిబ్బంది పగలగొట్టించారు. వారి సమక్షంలోనే కేంద్రంలోని సరుకులను పంచనామా చేయించడం విశేషం. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

ఎమ్మెల్సీ సాబ్జీకి అశ్రునివాళి

విజయనగరం టౌన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. సాబ్జీ మృతి విషయం తెలుసుకున్న వీరంతా సమ్మె శిబిరం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో జరుగుతున్న అంగన్వాడీ పోరాటానికి సంఘీభావం తెలియజేసి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజు, సిఐటియుజిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అభివృద్ధి ముసుగులో దోపిడీ

- టిడిపి జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్
- యువగళం ముగింపు సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అభివృద్ధి ముసుగులో పూర్తిగా జిల్లాను దోచుకుంటున్నారని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా పోలిపల్లిలో నిర్వహించే ముగింపు సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన అశోక్బంగ్లాలో నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ లోకేష్ బాబు పాదయాత్ర ముగింపు సభను ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. గత ఐదేళ్లగా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోకుండా పెద్ద ఎత్తున దోపిడీకి గురైన జిల్లా విజయనగరం అన్నారు. 'మనం గతంలో డీ కంపెనీ గురించి విన్నాం. డి అంటే దావూద్ కంపెనీ, ఆ కంపెనీ ముంబై నగరాన్ని ఎలా దోచుకుందో అనేక రకాలుగా పుస్తకాల్లో చదివాం, సినిమాల్లో చూసాం. అటువంటిదే బి- కంపెనీ విజయనగరంలో ఆవిర్భవించింది. వారు జిల్లాను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. బి- కంపెనీ అంటే బాద్షా కుటుంబ భాగస్వాములు. వీరిలో జిల్లా పరిషత్ ఛైర్మన్ చిన్న శీను, నెల్లిమర్ల ఎమ్మెల్యే అప్పలనాయుడు, గజపతినగరం ఎమ్మెల్యే అప్పల నరసయ్య పార్టనర్స్' అంటూ విమర్శించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే 420 ఎకరాలు సాగుదారుల నుంచి నష్టపరిహారం దోచుకోవడానికి చూస్తే దాన్ని టిడిపి నాయకులు బంగారు రాజు అడ్డుకున్నారని అన్నారు. గ్రావెల్స్ , మైనింగ్ దోచుకుంటున్నారని తెలిపారు. ఈ ఐదేళ్లలో ఒక్క కంపెనీ అయినా పెట్టారా? ఉన్న వాటిని అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ లోకేష్ బాబు పాదయాత్ర ముగింపు సభ చరిత్రలో గొప్ప సభగా మిగిలిపోవాలన్నారు. కిమిడి నాగార్జున మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దయి జైలుకి వెళ్లిపోతే వైసిపి నాయకులంతా ఆ పార్టీని కాంగ్రెస్లో విలీనం చేయడం ఖాయమని అన్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న మద్యం పాలసీ వలన ప్రజలలో పరివర్తన వస్తుందని అనడం బొత్స సత్యనారాయణకే సాధ్యమన్నారు. మద్యం రేట్లు పెంచేసి చిన్న కుటుంబాలను చిన్నాభిన్నం చేశారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజలకు ఇచ్చిన మద్యపాన నిషేధం హామీ ఏమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున , నియోజకవర్గ ఇంచార్జ్ అదితి గజపతి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్

23న జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం (బెంగుళూరుక్కి), నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సహకారంతో ఈనెల 23న దక్షిణ భారత స్థాయి జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. నగరంలోని సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూలు ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి ప్రదర్శన ఉంటుందని తెలిపారు. భౌతిక శాస్త్రం, కెమిస్ట్రీ, గణితం, ఎర్త్/స్పేస్ సైన్స్ , పర్యావరణ శాస్త్రం, ఇంజనీరింగ్, బయోసైన్స్/బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అనే అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. టీచర్ ఎగ్జిబిట్ , విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్ విభాగాల్లో ప్రదర్శనలు ఉంటాయన్నారు. జిల్లాలో అత్యుత్తమంగా నిలిచిన 3 టీచర్ ప్రాజెక్టులు, 3 వ్యక్తిగత ప్రాజెక్టులు, 3 గ్రూపు ప్రాజెక్టులు మొత్తం 9 ప్రాజెక్టులు ఈనెల 28,29తేదీల్లో కడప లో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనలలో జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు (8, 9, 10 తరగతి విద్యార్థులకు మాత్రమే) ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేసి ప్రాజెక్ట్ నమోదు చేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ఆశాల 36 గంటల నిరసన

వారంలో స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని డిఎంహెచ్ఒ హామీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్లు చేపట్టిన 36 గంటల నిరసన ధర్నా, వంటా వార్పు కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలతో ముగిసింది. రెండు రోజులు పాటు విధులకు హాజరుకాకుండా ఆశా వర్కర్లంతా గురువారం నుంచి రాత్రి చలిలో వణుకుతూ నిరసనలో పాల్గొన్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. డిఎంఅండ్హెచ్ఒ భాస్కరరావు ధర్నా శిబిరం వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వేధింపులు ఆపాలని, చనిపోయిన ఇద్దరు ఆశా వర్కర్ల పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలని ,అదనపు పనులు నియంత్రించాలని, స్థానిక సమస్యలు పరిష్కారం కోసం మెడికల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వంకనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని, మొబైల్ వర్క్ శిక్షణ ఇవ్వాలని, రికార్డ్ లేదా ఆన్లైన్ ఏదైనా ఒకే పని చేయించాలని కోరారు. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవులు అమలు చేయాలని, ఎఎన్ఎం, సచివాలయ హెల్త్ సెక్రటరీ నియమకాల్లో ఆశాలకు వెయిటేజి ఇవ్వాలని డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో స్థానికంగా చెప్పిన సమస్యలు వారం రోజులులో పరిష్కారం చేస్తానని, చనిపోయిన ఇద్దరు ఆశా వర్కర్లు పిల్లలకు ఉద్యోగం వచ్చే విధంగాపై అధికారులు దృష్టిలో పెట్టి పరిష్కరిస్తానని, మెడికల్ అధికారుల తో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టిన ప్రాంతంలో వంట వార్పు చేసి బోజనాలు చేశారు కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్. శాంతమ్మ, ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు ; ధర్నాలో పాల్గొన్న ఆశావర్కర్లు

రెండో రోజుకు జిడిఎస్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తపాలా శాఖ లో ఉన్న జిడిఎస్ ఉద్యోగులకు 8 గంటలు పని దినాన్ని అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిడిఎస్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజు కి చేరుకుంది. సమ్మె సందర్భంగా స్థానిక ప్రధాన తపాలా కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జి డిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పెంట పాపయ్యలు మాట్లాడుతూ 8 గంటల పనిని మంజూరు చేసి, శాఖ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ సహా ఇతర ప్రయోజనాలు కల్పించాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ నివేదిక అమలు చెయ్యాలన్నారు. 1-1 నుండి అమల్లోకి వచ్చే సీనియారిటీపై తగిన వెయిటేజీతో టిఆర్సిఎ స్థిరీకరణ డిపార్టుమెంట్ ఉద్యోగులతో సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 180 రోజుల వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ - రిటైర్డ్ జిడిఎస్లందరికీ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిడిఎస్, సాధారణ సిబ్బందికి వార్షిక ఇంక్రిమెంట్ విధానం ఒకేవిధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మె శిబిరంలో జిడిఎస్ ఉద్యోగులు

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఉన్నతాధికారులు

అమరజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నాగలక్ష్మి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ అనిత, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర రావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి కె. సందీప్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు అనుసరణీయమని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడి : పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వే గేటు వద్దనున్న అమరజీవి విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు వివిఎస్ఎస్ఎన్ గుప్తా, మండల అధ్యక్షులు ఎస్.వెంకటరాజు, ఎంపిటిసి ఎడ్ల సూర్యారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పూసర్ల సూర్యారావు, గ్రంధి రమణ, బివిఎల్ నరసింహులు, వెంకట సత్యనారాయణ, నారాయణరావు, అప్పలరాజు, మోహనరావు పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్ మాకొద్దు

ప్రజాశక్తి-వేపాడ

పవర్‌ప్లాంట్‌ను వ్యతిరేకిస్తున్న గిరిజనులు

తమ భూముల్లో ఏర్పాటు చేయాలని చూస్తున్న పవర్‌ప్లాంట్ ప్రాజెక్టు తమకొద్దని మారిక గిరిజనులు తెగేసిచెప్పారు. శుక్రవారం మారిక గ్రామ పరిధిలో చేపడుతున్న డ్రోన్ సర్వేను గిరిజనులు అడ్డుకున్నారు. కొంతమంది వ్యాపారులు నాలుగేళ్లుగా తమ భూములు ఆన్‌లైన్ చేసి పట్టాభిరామస్వామి సమ్మిలి, 50 ఎకరాలకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తంచేశారు. డ్రోన్ సర్వే పేరుతో మరికొంతమంది వ్యాపారులు తమ జిరాయితీ భూములను లాక్కోవాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. తమ భూసమస్యను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచలేదని, ఇప్పుడు అదే భూములను కాజేయాలని చూడటం దారుణమని మండిపడ్డారు. గిరిజనుల భూముల్లో పవర్ ప్లాంట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయవద్దని, తమ బతుకులను బుగ్గిపాలు చేయొద్దని గిరిజనులు పాలి సోమేశ్వర్రావు, బాబూరావు, నాగరాజు, తదితరులు వేడుకొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

మండలంలోని తిమిడి సచివాలయ పరిధిలో శుక్రవారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ సిఎంగా జగన్ ఎందుకు అవసరమో వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, సర్పంచులు కూనిరెడ్డి వెంకటరావు, ఒబ్బిన త్రినాథమ్మ, ఎంపిటిసి పడాల ధర్మారావు, వసి బంగారునాయుడు, తలారి అనంత్, అవాల కృష్ణ పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు విఫలం

విజయనగరం టౌన్ : ఫాస్ట్ ట్రాక్ కోర్టులు న్యాయాన్ని అందించడంలో విఫలమవుతున్నాయని, కోర్టుల సంఖ్యను పెంచాలని బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నాటికి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులలో 2,43,237 పోక్సో కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఈ బ్యాక్ లాగ్ ను క్లియర్ చేయడానికి ఈ కోర్టులకు కనీసం 9ఏళ్ల సమయం పడుతుందన్నారు. పతి బిడ్డకు న్యాయం జరిగేలా చూడాలి అనే లక్ష్యం పక్కాగా అమలు కావాలన్నారు. అన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు క్రియాశీలంగా పనిచేయాలన్నారు. సమావేశంలో సభ్యులు అప్పలనాయుడు, యూనిస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి ఆడిట్

రేగిడి : ఉపాధి హామీలో చేపట్టిన పనులపై ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించాలని వైస్ ఎంపిపిలు ఉంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, ఎపిడి శ్రీనివాస్ అన్నారు. రేగిడి ఎంపిడిఒ కార్యాలయంలో ఆడిట్, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి 16వ సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఎపిఒ హరినాథ్ మాట్లాడుతూ సుమారు రూ.19 కోట్ల పనులకు సంబంధించి ఆడిట్ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్యామలకుమారి, ఎంఇఒ రామకృష్ణ, ఎస్ఆర్‌పి ఎస్.మాధవరావు, జెసి రామినాయుడు ఉన్నారు.

వికలాంగులకు ఉపాధ్యాయుల చేయూత

బాడంగి : బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆరుగురు వికలాంగ విద్యార్థులకు టెస్ట్ స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు అందజేశారు. ఇదే పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కిలపర్తి నారాయణ, జి.విజయమ్మలు హెచ్ఎం సత్యనారాయణ చేతుల మీదుగా స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు యు.రామారావు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

కొత్తవలస : రాజాపాత్రునిపాలెం గ్రామానికి చెందిన పద్మావతి మణికి సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి బోర్ల శ్రీను, పిఎసిఎస్ పాత్రుడు, రామన్నపాత్రుడు, గొరపల్లి రవి, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ : సింగరాయి ఎంపియుపి పాఠశాల, వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరు, విద్యా బోధన విధానం, పాఠశాల ఆవరణ, మొక్కల పెంపకం, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సింహాచలమమ్మ, వివి ప్రభు, సిఆర్‌పి రాంప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

రేపు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

బొబ్బిలి : స్థానిక శ్రీస్వ ఎన్ఆర్‌ఐ ఆసుపత్రిలో ఆదివారం ఉచితంగా నోటి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సిఇఒ ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో చెప్పారు. ఆరోగ్యా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

20న ఎస్సీ వర్గీకరణకు చలో ఢిల్లీ

రామభద్రపురం : ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఈ నెల 20న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పెంకి సుధాకర్ మాదిగ కోరారు. శుక్రవారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల సభల్లో ప్రధాని మోడీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని, న్యాయంగా మాదిగలకు రావాల్సిన రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.నాగరాజు పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తోన్న గ్రావెల్

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- తాత్కాలిక పర్మిట్ల పేరిట కూపన్లు
- తహశీల్దార్ కార్యాలయానికి ముడుపులు!

మట్టిని తవ్వేస్తున్న ఈ చిత్రం బాడంగి మండలం కేంద్రం సమీపంలోనిది. ఇక్కడ మట్టి తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి అనుమతులు లేవు. జిల్లాలో రాయల్టీ వసూలు చేస్తున్న ప్రయివేటు సంస్థను ఓ వ్యక్తి ప్రసన్నం చేసుకోవడంతో తాత్కాలిక పర్మిట్ల పేరిట తవ్వకాలు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో వందలాది టిప్పర్ల మట్టిని అక్రమంగా తవ్వేసుకొని అమ్మేసుకుంటున్నారు. రూ.లక్షల విలువ చేసే గ్రావెల్ తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ తతంగం మొత్తం తహశీల్దార్ కనుసన్నల్లోనే సాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రజాశక్తి-బాడంగి

పైసలిస్తే చాలు నిబంధనలు అతిక్రమించి మరీ మట్టి తవ్వుకునేందుకు పచ్చ జెండా ఊపేస్తున్నారు అధికారులు. ఆయన అండతో రాయల్టీ చెల్లించకుండా, సీనరేజ్ కట్టకుండా ఎర్ర మట్టిని తవ్వేసుకుంటూ అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. సదరు అధికారి రియల్టర్లకు కొమ్ముకాస్తూ ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయాన్ని సైతం దారి మళ్లించి తన జేబు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని ఆ శాఖ సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

బాడంగి మండల కేంద్రంలో గ్రావెల్ దందా అడ్డగోలుగా సాగుతోంది. తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చెరువు నుంచి నిత్యం టిప్పర్లతో వందల లోడ్ల గ్రావెల్ తరలిపోతోంది. జెసిబితో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో రాత్రి పగలూ తేడా లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారు. ప్రయివేటు లేఅవుట్లతోపాటు పలు గ్రామాలకు అమ్మేసుకుంటూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.1200కు అమ్ముతున్నారు. బాడంగి మండల కేంద్రానికి సమీపంలో ఓ వ్యక్తికి తాత్కాలిక పర్మిట్ల పేరిట అక్రమ మట్టి తవ్వకాలకు రెవెన్యూ అధికారి అనుమతి ఇచ్చారని సమాచారం.

సిపిఎం పరిశీలనతో కదలిక

బాడంగి మండల కేంద్రం సమీపంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. అనుమతులున్నాయా? లేవా? అని జెసిబి డ్రైవరును ప్రశ్నించగా లేవని సమాధానమిచ్చాడు. సిపిఎం నాయకులు సమాచారాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లడంతో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న వ్యక్తి ఆగమేఘాలపై అక్కడికి చేరుకున్నాడు. వెంటనే రామభద్రపురం నుంచి రాయల్టీ వసూలు చేస్తున్న ప్రయివేటు సంస్థ ప్రతినిధి అక్కడికి వచ్చారు. గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లకు కూపన్లు పంపిణీ చేయడం ప్రారంభించారు. అనుమతులపై సిపిఎం నాయకులు ప్రశ్నించగా, దురుసుగా సమాధానమిచ్చారు. అక్రమంగా మట్టి తవ్వి, తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు సురేష్ ఉన్నతాధికారులను కోరారు. రాయల్టీ ఛార్జీల పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పర్మిట్ల పేరుతో కూపన్లు ఇస్తున్న వ్యక్తి

తప్పుడు కథనంపై కోర్టులో కేసు వేస్తా

మాట తూలి ఉంటే దానికే కట్టుబడతా • ఎమ్మెల్యే శంబంగి వివరణ

ప్రజాశక్తి-రామభద్రపురం

ఇటీవల ఓ దినపత్రికలో తన మాటగా వచ్చిన వార్త తప్పుడు కథనమని, అంగన్వాడీలపై తాను ఎటువంటి అనుచిత వ్యాఖ్యలూ చేయలేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వివరణ ఇచ్చారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మహిళలను కించపరిచేలా ప్రసంగాలు, మాటలు వాడలేదని, ఒకవేళ సందర్భానుసారం ఏం మాట్లాడినా అటువంటి వ్యాఖ్యలకు కట్టు బడే ఉంటానని స్పష్టంచేశారు. ఆరోజు కొట్టక్కిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వెళ్తుండగా ఆ పత్రికకు చెందిన విలేకరి అంగన్వాడీ సమస్యపై అడుగగా, సానుకూలంగా స్పందించానే తప్ప ఎటువంటి అనుచిత వ్యాఖ్యలూ చేయలేదని... ఆ పత్రికలో రాసిన రాతలు తన నోటి నుంచి రాలేదని వివరణ ఇచ్చారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని అంగన్వాడీల సిబ్బందికి తన ప్రవర్తన, నడవడిక, మాటతీరు తెలుసని, వారే గుర్తించాలని అన్నారు. ఇటువంటి తప్పుడు కథనాన్ని ప్రచురించిన పత్రికపై కోర్టు కేసు వేయనున్నట్లు తెలిపి ఆ వివరాలు చూపించారు. ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా మలుచుకునే ఇలాంటి చవకబారు పనుల వల్ల తమ ప్రతిష్ట మరింత రెట్టింపు అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో కేసు వేస్తామని వివరాలు చూపుతున్న ఎమ్మెల్యే శంబంగి

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చినప్పలనాయుడు ఆదేశించారు. స్థానిక పిఎసిఎస్‌లో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రైతు పక్షపాతి అన్నారు. నిరంతరం రైతు శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సరస్వతి, పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్రశేఖర్, తహశీల్దార్ సులోచనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్య కళాశాల విద్యార్థినుల ప్రతిభ

విజయనగరం టౌన్ : స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ఎస్. పల్లవి, సిహెచ్ శ్రీలక్ష్మి ఈనెల 7 నుంచి 9 వరకు రాజమండ్రి నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన సౌత్,వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. పల్లవి 64కేజీల విభాగంలో బంగారు పతకం, సిహెచ్ శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఫెన్సింగ్‌లో బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రీ రూప్య ఆంధ్ర యూనివర్సిటీ గేమ్స్అండ్ స్పోర్ట్స్ అంతర్ కళాశాలల పోటీలో ప్రథమ స్థానాన్ని పొంది, జోన్ స్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం. శశి భూషణ రావు , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్య వేణి వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం

భోగాపురం.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. మండలంలో ఉన్న అన్ని ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఎఒ హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ సుందర హరీష్, సొసైటీ సిబ్బంది జనార్ధన్‌రావు, రమేష్, నాయకులు కొయ్య బంగారురాజు, మాజీ ఎంపిటిసి గురువులు, సుందర వెంకన్న పాల్గొన్నారు.

గుర్ల : మండలంలోని తెట్టంగి, వల్లపురం రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, పలాస నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణ రాజు జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో తెట్టంగి పిఎసిఎస్ చైర్మన్ రవిబాబు, సిఇఒ రామునాయుడు, మండల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు, జమ్ము లచ్చన్న, ఎఒ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మండలంలోని చింతాడ, కలవరాయి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, చింతాడ, కలవరాయి సర్పంచులు బంకురు తిరుపతి, బొత్స నటరాజ్, పిఎసిఎస్ అధ్యక్షులు శంబంగి సూరపునాయుడు, కోమటిపల్లి రామారావు, ఎంపిటిసి పాటూరి సింహాచలం, మాజీ ఎంపిటిసి కర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమావేశం

వేపాడ : స్థానిక వైకెపి కార్యాలయంలో ఎఒ యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలుపై శుక్రవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ మండలంలో 17,222 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని, అందులో 16,361 టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. 20 వేల గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. సమావేశంలో సివిల్ సప్లై డిటి, ఎఇఒ అక్కునాయుడు, విఎఎలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సాయంత్రం 5.30 గంటలు నుంచి 8 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, బకాయిలు చెల్లించాలని, మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 22న జిల్లా స్థాయి సదస్సు, డిసెంబర్ 30న విజయవాడలో ధర్నా చేపడతామని తెలియజేశారు. ధర్నాలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పొట్టా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర కౌన్సిలర్ డి. రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్ భాస్కర్ రావు మాట్లాడారు. జిల్లా కార్యదర్శులు కె. ప్రసాదరావు, పి. త్రినాథ్, సిహెచ్ తిరుపతి నాయుడు, జి.రాజారావు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శంకరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి.. సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగార్జున

లోకేష్‌కు సమస్యలు వివరిస్తున్న కొల్లి అప్పలనాయుడు

యువగళం ముగింపు సభకు తరలిరావాలి

టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఈ నెల 20న భోగాపురం మండలం పోలిపల్లిలో జరిగే యువగళం పాదయాత్ర ముగింపు సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున కోరారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో నాగార్జున మాట్లాడారు. భోగాపురంలో జరిగే సభకు పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో టిడిపి నియోజకవర్గ నాయకులు పైల బలరాం, రౌతు కామునాయుడు, వెన్నె సన్యాసి నాయుడు, టి.కిరణ్ కుమార్ రాజు, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ బాబు, తాడ్డే సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యువగళం సభా స్థలి పరిశీలన

భోగాపురం : మండలంలోని పోలిపల్లి సమీపంలో చేపడుతున్న యువగళం పాదయాత్ర ముగింపు సభ ఏర్పాట్లను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. సభా స్థలంతోపాటు పార్కింగ్ ఏరియాను పరిశీలించారు. ఏర్పాట్లపై టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగారురాజుతో చర్చించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి దామచర్ల సత్య, భరత్, కోరాడ రాజబాబు, సువ్వాడ రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన అప్పలనాయుడు

బాడంగి : అచ్యుతాపురంలో సాగుతున్న యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కొప్పలవెలమ బిసి సాధికారత పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు కలిసి, వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు

జెడ్‌పి చైర్మన్ మజ్జి

ప్రజాశక్తి-మెరకముడిదాం

సమావేశంలో ప్రసంగిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చెల్లాపురం పంచాయతీలో నూతన సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఉన్న 464 గడపకు సుమారు రూ.10.50 కోట్లను ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. 64 ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తాడ్డి వేణుగోపాలరావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల వెంకటరావు, నాయకులు కర్రోతు నాగేశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్, ఎంపిటిసి సభ్యులు పల్లి క్రిష్ణ, పప్పల క్రిష్ణమూర్తి, తాడేలా ఉమా మహేశ్వరరావు, తాడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న వృద్ధుడి ఆరోగ్యం క్షీణించడంతో కొంతమంది సామాజిక కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.

ఓటరు జాబితా తనిఖీ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న నియోజకవర్గ ఓటర్ల జాబితాను జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మధుసూదనరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్పులు నాలుగు శాతం కంటే ఎక్కువ, తొలగింపులు రెండు శాతం కంటే ఎక్కువగా ఉంటే ప్రత్యేక పరిశీలన చేయాలన్నారు. ఆయనతోపాటు ఎన్నికల డిటి బి.గౌరీశంకరరావు పాల్గొన్నారు

రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో135 మిల్లులు ఉన్నాయని తెలిపారు. మిల్లు యజమానులు రూ.54 కోట్లు బ్యాంకు గ్యారంటీ ఇచ్చారని తెలిపారు. 3.20 లక్షల గోనెసంచులు రైతులకు అందివ్వాలని నిర్దేశించామన్నారు. రోజువారీ కొనుగోళ్లపై సమీక్ష ఉంటుందన్నారు.

వృద్ధురాలి హత్య

పూసపాటిరేగ : మండలంలోని చల్లవానితోట పంచాయతీ కొండగుడ్డి గ్రామానికి చెందిన మహంతి రాజమ్మ (65) శుక్రవారం హత్యకు గురైంది. మధ్యాహ్నం మామిడితోటలో ఒంటరిగా పశువులు కాస్తున్న సమయంలో దుండగులు ఆమెను హత్యచేశారు. ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు రాము వెతికారు. చోడమ్మఅగ్రహారం నుంచి కుమిలి వైపు వెళ్లే రహదారి సమీపంలో ఆమె విగతజీవిగా కనిపించింది. ఆమె శరీరంపై మూడుచోట్ల కత్తిపోట్లు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదుచేశారు.

మృతిచెందిన రాజమ్మ

CHANGE OF NAME

I, SHIEK KHALEEL (Old name), S/o Late SHAIK BABJI, Aged 50 years, Muslim, Residing at D.No.24-3/1-49, Mastan Street, Vizianagaram Town and District. Changing my name from **SHIEK KHALEEL** (Old name) to **SHAIK KHALEEL** S/o SHAIK BABJI, hence forth being called as **SHAIK KHALEEL** (New name) for all purposes.

BEFORE THE HON'BLE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE AT ANAKAPALLI
H.M.O.P.69/2023

Between:
Sri Dwarapureddi Srinivasu ...Petitioner
And
1) Smt.Chinni Naga Sai
2) Anil Valluri .. Respondents
To
2nd Respondent
Anil Valluri, aged 32 years, Assistant Manager, Indian Overseas Bank, Vadadi, Dist-Anakapalli, Permanent resident of 13-357,AjayNagar, Parvathipuram, Vizianagaram, Andhra Pradesh-535501

Whereas the above Petitioner has filed the above petition against you for the reliefs mentioned therein. Take notice that in the above proceedings you are hereby directed to appear before the **Honourable Addl.Senior Civil Judge Court, Anakapalle on 22-12-2023 at 10.30 A.M** either in person or through an Advocate failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA
Advocates, Visakhapatnam
Ph: 0891-2755164

మహారాజశ్రీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 27/2023

Between:
Vemparala Venkata Naga Praveen ....Plaintiff
And:
State Bank of India and 7 Others ....Defendants
To
D3. నున్నగుప్పల సూర్యనారాయణ, S/o లేటు సోములు, ఇంటి నెం.32-192, చింతలదిమ్మ గ్రామం, అర్ధానపాలెం పోస్టు, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా.
D4. మెరపల రాఘవేంద్రుడు, S/o నాయినప్ప, ఇంటి నెం.5-8/1, కొత్తవలస గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో మీకు సమన్లు అందుకునే నిమిత్తము **తేది 03-01-2024** వాయిదా ఉన్నందున ఆ రోజున మీరు ప్రత్యక్షముగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు కావలయును. లేని యెడల ఈ దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఈ పత్రికా ప్రకటన మూలముగా తెలియజేడమైనది.

D.Siva Prasad
Advocate,
Kothavalasa,
Cell: 9705751794